ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



చిత్తూరు జిల్లా వార్తలు

ఆదివారం 27 అక్టోబరు 2024

ఆదివారం ప్రత్యేకం

బతుకులతో 'సెల్'గాటం

- విపరీతంగా పెరిగిన ఫోన్ వాడకం
- పెరుగుతున్న అనారోగ్య సమస్యలు

నిద్రపోయేటప్పుడు ముట్టుకునే చివరి వస్తువు.. నిద్ర లేవగానే ముట్టుకునే తొలి వస్తువు.. సెల్‌ఫోన్. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్‌కు అనుసంధానమైపోయారు. కొందరైతే రోజులో ఏకంగా 8 గంటలకు పైగా సెల్‌ఫోన్ చూడ్డానికే సమయాన్ని కేటాయిస్తున్నారు. అయితే ఫోన్‌ను అధికంగా వినియోగించడం ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తోంది.స్మార్ట్ ఫోన్‌ని కౌమార దశలో ఉండేవారు వినియోగించడంపై కొరియాలోని హన్యాంగ్ యూనివర్శిటీ మెడికల్ సెంటర్ బృందం పరిశోధన చేపట్టింది. 50వేల కంటే ఎక్కువ మందిపై అధ్యయనం చేశారు. రోజుకు 4 గంటల కంటే ఎక్కువ సమయం ఫోన్ వాడడం వల్ల ఒత్తిడి, ఆత్మహత్య ఆలోచనలు పెరగడంతో పాటు మాదక ద్రవ్యాల వినియోగం ఎక్కువవుతోందని తేలింది.



అధికంగా వాడితే ఇబ్బందులే

- స్క్రీన్ చూసే సమయం పెరగడంతో శారీరక శ్రమ తగ్గి బరువు పెరుగుతారు.
- రాత్రిళ్లు ఎక్కువ సమయం మేల్కోవడంతో నిద్రలేమి,వినికిడి సమస్యలు ఏర్పడుతాయి
- కళ్లు పొడిబారడం, తలనొప్పి, పార్శ్వపు నొప్పి, దృష్టిలోపం రావచ్చు
- బైక్ నడుపుతూ ఫోన్ మాట్లాడటంతో మెడనొప్పి వస్తుంది.

ఫోన్ వాడకాన్ని తగ్గించుకోవచ్చు

- ఫోన్‌ను ఎంతసేపు వాడుతున్నారో చెక్ చేసుకుంటే రోజురోజుకు మెల్లగా తగ్గించవచ్చు.
- హాబీస్‌పై దృష్టి పెట్టడం ద్వారా సెల్‌ను కాసేపు పక్కన పెట్టొచ్చు.
- ఫోన్‌లో అలారం పెట్టడం వల్ల ఉదయం లేవగానే సోషల్ మీడియా యాప్స్ వంటివి చూస్తూ ఉండిపోతారు. అందుకే అలారం వేరే పరికరంలో పెట్టుకుంటే మేలు.
- ఫేస్‌బుక్, ఇన్‌స్టా, వాట్సాప్ సహా ఉద్యోగ సంబంధ మెయిల్స్‌కు రిప్లై ఇవ్వడానికి నిర్దిష్ట సమయాన్ని కేటాయిస్తే మేలు.
- మధ్యాహ్నం నిద్రకు ముందు, భోంచేసేటప్పుడు.. ఫోన్ ఆఫ్ చేసుకోవచ్చు.

డ్రై ఐస్, సైట్ పెరగడం వంటి ప్రమాదాలు



సెల్‌ఫోన్, సిస్టమ్ ఎక్కువ వాడడం వల్ల కంటి రెటీనా దెబ్బ తింటుంది. ఎక్కువగా వినియోగించేవారు కళ్లకు ఇబ్బంది లేకుండా బ్లూఫిల్టర్ అద్దాల్ని వాడితే రేస్ రెటినా వరకు వెళ్లకుండా అద్దాలు కంట్రోల్ చేస్తాయి. సెల్‌ఫోన్ దగ్గరగా పెట్టుకుని చూస్తే సైట్ వచ్చే ప్రమాదముంది. అలాగే వయోటిక్ షిఫ్ట్ జరిగి ఫైనెస్ పవర్ పెరుగుతుంది. అంటే ఉన్న సైట్ మరింత అధికమవుతుంది. సెల్‌ఫోన్ రోజుకు 30-45 నిమిషాలకు మించి చూడకూడదు. ముఖ్యంగా లైట్లన్నీ ఆపేసి సెల్‌ఫోన్ చూడడం మరింత ప్రమాదకరం. ఎక్కువగా చూడడంతో 'డ్రై ఐస్' వస్తాయి. దాంతో కళ్లు రెడ్‌గా మారి నీళ్లు కారుతాయి. వెలుగు చూడలేం. ఫ్యాన్ కింద కూర్చుంటే ఇరిటేషన్ వస్తుంది. ఎక్కువ సేపు సిస్టమ్ వాడే వారి కోసం 20:20:20 రూల్‌ను ఫాలో అవమని చెబుతుంటాం. 20 నిమిషాలకోసారి పనిలో గ్యాప్ తీసుకుని 20 అడుగుల దూరంలో ఏదో వస్తువును 20 సెకండ్ల పాటు ఫోకస్ చేసి చూడాలి. ఇంకొందరు పనిలో పడి కళ్లు మూయడం మర్చిపోతుంటారు. గంటకోసారి అలారం పెట్టుకుని మరీ రెండు నిమిషాల పాటు కళ్లు పూర్తిగా మూయాలి.

- డాక్టర్ గీతా అనూష, కంటి వైద్య నిపుణులు, సంజీవని జనరల్ సర్జరీ అండ్ ఐ క్లినిక్, చిత్తూరు

ఎంతసేపు వాడామో తెలుసుకోవచ్చు

సెల్‌ఫోన్‌ను ఎంత సేపు వినియోగించామనే సమాచారాన్ని మనం తెలుసుకోవచ్చు. స్మార్ట్ ఫోన్ సెట్టింగ్స్‌లోకి వెళితే.. డిజిటల్ వెల్‌బీయింగ్ అండ్ పేరెంటల్ కంట్రోల్స్ అని ఉంటుంది. కొన్ని ఫోన్లలో డిజిటల్ వెల్ బీయింగ్ అనే ఆప్షన్ మాత్రమే ఉంటుంది. ఈ ఆప్షన్‌ను క్లిక్ చేస్తే ఓపెన్ చేసిన రోజు ఎంతసేపు ఫోన్‌ను వినియోగించాం, అందులో ఏయే యాప్స్‌కు ఎంత సమయం కేటాయించామన్నది కనిపిస్తుంది. వ్యూ యాక్టివిటీ డీటైల్స్ ఆప్షన్‌ను క్లిక్ చేయడం ద్వారా మరింత సమాచారం కూడా వస్తుంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



మద్యపానం తరహా బానిసత్వమే

కొవిడ్ సమయంలో ఖాళీగా ఉండి పెద్దలు సెల్‌ఫోన్ వాడితే, పిల్లలు ఆన్‌లైన్ క్లాసుల పేరుతో సెల్‌కు బానిసలు అయ్యారు. యువత ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడడం, పోర్న్ వీడియోలు చూడడానికి ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. విద్యార్థులు ఎక్కువ సేపు సెల్ వాడితే చదువు మీద ధ్యాస తగ్గిపోయి చిరాకు, కోపం, విసుగు వస్తాయి.నిద్ర కూడా సరిగా పట్టదు. సెల్‌ఫోన్ అధికంగా వినియోగించడం కూడా మద్యపానం తరహా వ్యసనం లాంటిదే. వెంటనే అలవాటును మానుకోలేరు. కొద్దికొద్దిగా మానుకుంటూ రావాలి. చిరాకు, కోపం అధికంగా వస్తున్నప్పుడు మానసిక వైద్యుల్ని సంప్రదించాలి.చిన్న పిల్లల విషయానికొస్తే అసలు ఫోన్ ఇవ్వకూడదు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇవ్వాల్సి వస్తే తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి. పెద్దలు కూడా 3 గంటల కంటే ఎక్కువసేపు ఫోన్ వాడుతున్నారంటే బానిస అయినట్లే అని గ్రహించి, అలవాటును తగ్గించుకోవాలి.

- డాక్టర్ దినేష్, మానసిక వైద్యులు, ప్రీతమ్ హాస్పిటల్, చిత్తూరు

కుంకీలతో గజదాడులను

అరికడతాం

- చీఫ్ కన్జర్వేటర్ అజయ్‌కుమార్ నాయక్



ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట

కల్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జనావాసాలు, పంట పొలాలపై ఏనుగుల దాడులను అరికట్టేందుకు త్వరలో కుంకీ ఏనుగులతో రక్షణ చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వైల్డ్‌లైఫ్ అజయ్‌కుమార్ నాయక్, తిరుపతి చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం తెలిపారు. పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ సమీపంలోని తూర్పు అటవీ ప్రాంతాన్ని శనివారం సాయంత్రం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లా డీఎఫ్‌వోలు భరణి, వివేక్, జగన్నాథసింగ్‌లతో కలిసి వారు పరిశీలించారు. పలమనేరు కౌండిన్య అటవీప్రాంతం నుంచి రెండేళ్ల క్రితం పులిచెర్ల మండలంలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేస్తున్న నేపథ్యంలో ఏనుగులు దాడులు చేస్తున్న తీరు, అధికారులు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ఏనుగుల గుంపు సంచరించే అటవీ ప్రాంతాలను మ్యాప్‌లో పరిశీలించారు.ఈ సందర్భంగా అజయ్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ ఏనుగుల గుంపు జనారణ్యంలోకి వస్తుండడంతో జరుగుతున్న నష్టంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.గజదాడులను కుంకీ ఏనుగుల సాయంతో అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే ఏనుగుల గుంపును కౌండిన్య అటవీప్రాంతం వైపు తీసుకెళ్లేందుకు కుంకీ ఏనుగులను తీసుకొస్తామని తెలిపారు.ఫ్లయింగ్‌స్క్వాడ్ డీఎఫ్‌వో గురుప్రభాకర్, మదనపల్లె సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసులు, ఎఫ్ఆర్‌వోలు థామస్ సుకుమార్, ప్రియాంక, వేణుగోపాల్, మాధవి, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్‌వో చంద్రశేఖర్, డిప్యూటీ రేంజర్ కుప్పుస్వామి, ఎఫ్ఎస్‌వో మహ్మద్ షఫీ, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

పంటలపై కొనసాగిన గజదాడులు

పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీలో శుక్రవారం రాత్రి పంటలపై గజదాడులు కొనసాగాయి. కొబ్బరి, వరి, మామిడి పంటలకు అపారనష్టం వాటిల్లింది. కుమ్మరపల్లిలో సి. కృష్ణయ్యకు చెందిన 11 కొబ్బరి చెట్లు, 3 మామిడిచెట్లు, ఎం. కృష్ణయ్యకు చెందిన 3 మామిడిచెట్లతో పాటు పశుగ్రాసాన్ని ఏనుగులు ధ్వంసం చేశాయి.వంకాయలపాటివారిపల్లిలో రవీంద్రనాయుడికి చెందిన ఎకరా వరిపంటను ధ్వంసం చేసిన ఏనుగులు 20 మామిడిచెట్లను విరిచేశాయి.



కల్లూరు సమీపంలోని అడవిలో ఏనుగులు తిరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అజయ్‌కుమార్‌నాయక్

దీపావళి నుంచే బుకింగ్ ప్రారంభం

- ఉచిత సిలిండర్ల పథకంతో 5,80,297మందికి లబ్ధి
- జిల్లావాసులకు ఏడాదికి రూ.145.71 కోట్ల లబ్ధి

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలోని ఒక్కో కీలక హామీని నెరవేర్చుతూ వస్తోంది.ఇప్పటికే పెన్షన్‌ను రూ.వెయ్యికి పెంచిన ప్రభుత్వం తాజాగా కుటుంబానికి 3 సిలిండర్ల పథకం అమలుకు శ్రీకారం చుడుతోంది. దీపావళి నుంచి ఉచిత సిలిండర్లను అందిస్తామని ఇటీవల జరిగిన మంత్రి మండలి సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రకటించారు. దీంతో జిల్లాలో తెల్ల రేషన్‌కార్డు కలిగి, గ్యాస్ కనెక్షన్లు ఉన్న వారంతా అర్హులుగా మారనున్నారు. నిత్యావసర సరుకుల భారం పెరుగుతున్న ప్రస్తుత రోజుల్లో ఈ ఉచిత గ్యాస్ పథకంతో కొంత వెసులుబాటు కలుగుతుందని మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.జిల్లాలో జనరల్ (సింగిల్, డబుల్),



దీపం, ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు 5,80,297 ఉన్నాయి. వీళ్లందరికీ తెల్ల రేషన్ కార్డులు కూడా ఉన్న నేపథ్యంలో.. దాదాపు అందరూ అర్హత సాధించే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.837 ఉండగా.. ఏడాదికి మూడు సిలిండర్లను అందించనున్నారు. ఈ లెక్కన ఒక్కో కుటుంబానికి రూ.2511 లబ్ధి కలగనుంది. జిల్లావ్యాప్తంగా లబ్ధిదారులకు ఏడాదికి రూ.145.71 కోట్ల లబ్ధి చేకూరనుంది. తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు, గ్యాస్ కనెక్షన్ ఉన్న వారంతా ఈ నెల 31వ తేదీ నుంచి గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకోవచ్చని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డెలివరీ చేసిన 48 గంటల్లోనే లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో నేరుగా రాయితీ సొమ్ము జమ అవుతుంది.

జిల్లాలో గ్యాస్ కనెక్షన్ల వివరాలు

- జనరల్ కనెక్షన్లు: 3,23,483
- దీపం కనెక్షన్లు: 2,44,546
- ఉజ్వల కనెక్షన్లు: 12,268

బోగస్ ఎపిక్ కార్డులుంటే

వెంటనే వెనక్కివ్వండి

- తిరుపతిలో అక్రమ డౌన్‌లోడింగ్ నిర్ధారణ అయిందన్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : బోగస్ ఎపిక్‌కార్డులు తయారు చేసినా లేదా కలిగి ఉన్నా శిక్ష తప్పదని కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 39,251 ఎపిక్ కార్డుల(ఓటరుకార్డులు) డేటాను అనధికారికంగా డౌన్‌లోడ్ చేసినట్లు నిర్ధారణ అయిందని వెల్లడించారు. బోగస్ ఎపిక్‌కార్డుల ద్వారా 2021లో జరిగిన తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో అక్రమంగా ఓట్లు వేయడానికి ప్రయత్నించారని స్పష్టం చేశారు. దీనిపై ఇప్పటికే పలువురు అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నామని, కేసులు కూడా నమోదు చేశామని తెలిపారు. బోగస్ ఎపిక్‌కార్డులు కలిగి ఉన్న వ్యక్తులు వెంటనే వాటిని తిరుపతి అసెంబ్లీ ఎన్నికల అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్‌కు కానీ, కలెక్టర్ కార్యాలయంలో కాని అప్పజెప్పాలని శనివారం ఒక ప్రకటనలో సూచించారు.



కార్తీక్ మ్యాజిక్

తిరుపతిలోని ఎస్వీయూ స్టేడియంలో యువ గాయకుడు కార్తీక్ మ్యూజిక్ షో యువతను ఉర్రూతలూగించింది. భారీసంఖ్యలో హాజరైన యువతీయువకుల ఈలలు, చప్పట్లతో స్టేడియం మార్మోగింది.

- 6లో

సనాతనం.... సాధు, సంతుల స్వాగతం

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల ప్రకటించిన సనాతన ధర్మపరిషత్‌ను సాధు, సంతులు స్వాగతించారు. తిరుపతిలో శనివారం జరిగిన జాతీయ హిందూ ధార్మిక సదస్సులో ఆరు రాష్ట్రాలకు చెందిన వందలాదిమంది సాధువులు, మఠాధిపతులు, హిందూ ధార్మిక సంస్థల సభ్యులు, తిరుక్షేత్రాల రక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.



వాడవాడలా టీడీపీ సభ్యత్వ నమోదు



టీడీపీ సభ్యత్వ కార్డును చంద్రప్రకాష్ మెడలో వేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్



గంగవరం మండలం మామడుగులో సభ్యత్వ కార్డులతో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తదితరులు

- పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు,పార్టీ నాయకులు

చిత్తూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం జిల్లావ్యాప్తంగా ప్రారంభమైంది. ఆయా నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఎమ్మెల్యేలు, నాయకులు ముందస్తు ప్రణాళికలతో రంగంలోకి దిగారు. ఎంపీ, ఎమ్మెల్యేలు తొలి రోజే సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. ఎమ్మెల్యేలు, నాయకులు సభ్యత్వాన్ని నమోదు చేయించడం అటుంచితే.. చాలామంది కార్యకర్తలు వారి సెల్‌ఫోన్ల నుంచి స్వచ్ఛందంగా నమోదు చేసుకుని పార్టీ గ్రూపుల్లో పోస్టు చేసుకున్నారు. వాట్సాప్ స్టేటస్ పెట్టుకున్నారు. గుడిపాలలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్ తదితర నాయకులు ప్రారంభించారు.అంతకుముందు చిత్తూరు నగరంలోని మురకంబట్టులో, చిత్తూరు రూరల్ మండలంలోని బీఎన్ఆర్‌పేటలో ఎమ్మెల్యే జగన్మోహన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. గంగవరం మండలం మామడుగు గ్రామంలో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కుప్పం మున్సిపాలిటీలోని కమతమూరులో ఎమ్మెల్సీ శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం, చంద్రబాబు పీఏ మనోహర్ తదితరుల ఆధ్వర్యంలో సభ్యత్వాన్ని నమోదు చేశారు. ఎస్ఆర్‌పురం, జీడీనెల్లూరు, కార్వేటినగరం మండలాల్లో ఎమ్మెల్యే థామస్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. పూతలపట్టు మండలం వెంకటాపురం దళితవాడలో ఎమ్మెల్యే మురళీమోహన్ సభ్యత్వాన్ని నమోదు చేయించారు.పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి రొంపిచెర్ల మండలంలో సభ్యత్వాన్ని నమోదు చేసుకుని కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ వేయకుండా అడ్డుకున్న వైసీపీ నేతలపై తిరగబడిన అంజిరెడ్డి తాత.. సీఎం చంద్రబాబుతో జూమ్ కాల్‌లో మాట్లాడారు.

జీవితకాల సభ్యత్వం

టీడీపీ అధిష్ఠానం కొత్తగా ప్రవేశపెట్టిన జీవితకాల సభ్యత్వాన్ని కొందరు నాయకులు నమోదు చేసుకున్నారు. ఎస్ఆర్‌పురం మండలంలో 30మంది టీడీపీ నాయకులు ఎమ్మెల్యే థామస్ ఆధ్వర్యంలో రూ.లక్ష చొప్పున చెల్లించి లైఫ్‌టైమ్ మెంబర్‌షిప్ పొందారు. అలాగే బంగారుపాళ్యం మండల టీడీపీ అధ్యక్షుడు జయప్రకాష్ నాయుడు కూడా లైఫ్‌టైమ్ కార్డును తీసుకున్నారు.



జయప్రకాష్ నాయుడి సభ్యత్వ కార్డు

నగరి, సత్యవేడుల్లో ప్రారంభించిన స్థానిక నేతలు

నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మంత్రి నారా లోకేశ్‌తో కలసి విదేశీ పర్యటనకు వెళ్లిన నేపథ్యంలో ఆ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో మండల స్థాయి నేతలు సభ్యత్వ నమోదును ప్రారంభించారు. పుత్తూరు పట్టణంలో పార్టీ సీనియర్ నేతలు మునిరత్నం నాయుడు, గంజి మాధవయ్య సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టారు. ఇక సత్యవేడు విషయానికొస్తే పార్టీ అధిష్ఠానం సస్పెండ్ చేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కార్యక్రమంలో పాల్గొనలేదు. నియోజకవర్గ సమన్వయకర్త శ్రీపతిబాబు సత్యవేడులో మెంబర్‌షిప్ ఎన్‌రోల్‌మెంట్‌ను ప్రారంభించారు. అలాగే సత్యవేడు మండలం వీఆర్ కండ్రిగ, మదనంబేడు గ్రామాల్లో కూడా పాల్గొన్నారు.నియోజకవర్గ కేంద్రాలతో పాటు మండలాల్లో కూడా తొలిరోజు సభ్యత్వ నమోదు కార్యక్రమాలు జోరుగా మొదలయ్యాయి. స్థానిక నేతలు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి రోజు కొత్త సభ్యత్వాలు తక్కువగా నమోదు కాగా ఇప్పటికే సభ్యులుగా వున్న వారు తమ సభ్యత్వాలను రెన్యువల్ చేసుకోవడం ఎక్కువగా కనిపించింది.



ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న అదనపు ఎస్పీ వెంకట్రావు

పోలీసు ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన

ఆకట్టుకున్న ఓపెన్ హౌస్ ప్రదర్శన

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వెంకట్రావు పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం తిరుపతిలోని వివిధ కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. అమరులైన పోలీసులకు అంజలి ఘటించారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను ప్రజలందరికీ తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అనంతరం ఓపెన్ హౌస్‌లో ప్రదర్శనలో ఉంచిన ఆయుధాలు, పరికరాలు, వాటి పనితీరు గురించి విద్యార్థులకు వివరించారు. రోల్ ఆఫ్ యూత్ ఇన్ ప్రివెన్షన్ ఆఫ్ సైబర్ క్రైం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సాయుధ దళం శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పులి కాదండోయ్.. మేకపోతు

జీవకోన రాజీవ్‌నగర్‌కాలనీ సమీపంలోని ఓ మాంస దుకాణం వద్ద శనివారం పులితోలు కప్పుకున్నట్లు ఉన్న ఒక మేకపోతు కనిపించింది. చూడ్డానికి అచ్చం పులిలా ఉంది. శరీరమంతా పులిమచ్చలు ఉన్న ఈ మేకపోతు చూపరులను ఆకట్టుకుంది. ఇది శిరోహి జాతి మేకపోతని, ఒకప్పుడు రాజస్థాన్ నుంచి దిగుమతి చేసుకునేవారని, ప్రస్తుతం చుట్టుపక్కల పల్లెల్లోనే లభ్యమవుతున్నాయని దుకాణం యజమాని తెలిపారు.

- తిరుపతి (జీవకోన), ఆంధ్రజ్యోతి




















వాన కురిస్తే ప్రకృతి పరవశిస్తుంది. చెట్టూ పుట్టా పిట్టా పురుగూ.. సమస్తమూ సంతోషంతో కళకళలాడుతాయి. శేషాచలం అడవులు అనేకానేక రకాల పక్షులకు ఆవాసాలు. ఈ కొండబారు వెంబడే ఉన్న తిరుపతి నగర పరిసరాల్లోనూ పిట్టలు తారసపడుతూ ఉంటాయి. వాన కురిసి వెలిసిన వేళ.. నగరంలోనూ, శివారు పల్లె ప్రాంతాల్లోనూ ఆంధ్రజ్యోతి తిరుమల ఫొటోగ్రాఫర్ కెమెరా కంటబడ్డ రకరకాల పక్షుల చిత్రాలు ఇవి. రామచిలుకలు, వడ్రంగి పిట్టలు, పిచుకలు, గిజిగాడు, పసలపోలుగాడు.. వంటి ఎన్నో రకాలు సందడిచేస్తూ కనిపించాయి. తడిచిన రెక్కలు ఆరబెట్టుకుంటూ, ఊసులు చెప్పుకుంటూ, గూళ్లు అల్లుకుంటూ.. ఈ అందాల రెక్కల లోకాన్ని మీరూ ఆస్వాదించండి..

- ఆంధ్రజ్యోతి, తిరుమల

విహంగ గానం






















కేక పుట్టించిన

మ్యూజిక్ షో





తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ స్టేడియంలో శనివారం జరిగిన యువ గాయకుడు కార్తీక్ మ్యూజిక్ ప్రదర్శన యువతను కేరింతలు పెట్టించింది. అరవాన్ తమిళం, తెలుగులో ఏకవీర సినిమాకు సంగీతం కూడా అందించిన కార్తీక్ పాటలకు యువత భారీగా స్పందించింది. మహాగణపతి ప్రార్థనతో సంగీత విభావరి ప్రారంభమైంది. గజినీ సినిమాలోని ఒక మారు కలిసిన బంధం పాటతో ఉత్సాహం తారస్థాయికి చేరుకుంది. అరరె అరెరే మనసే జారే, ఉసురే పోయెను, సీతాకోకా నచ్చావే వంటి పాటలకు మంచి స్పందన



లభించింది. స్టేడియం అంతా యువోత్సాహం కనిపించింది. ముఖ్యంగా యాంకర్ ప్రశ్నలకు యువతీయువకులు ఉత్సాహంగా స్పందించారు. కార్తీక్ పాడిన పాటలను హమ్ చేశారు. రెండు గంటలకు పైగా సాగిన సంగీత విభావరి యువతను ఉర్రూతలూగించిందని చెప్పవచ్చు. కాగా ఏర్పాట్లు సరిగా లేకపోవడంతో ప్రేక్షకులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. భారీ ధరలతో టికెట్లు కొన్నవారికి కూడా సరైన సీటింగ్ వసతి లేకపోవడంతో మహిళలు కూడా నిలబడే షో చూడాల్సి వచ్చింది. పార్కింగ్ కోసం సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో ఇబ్బందులు తప్పలేదు. పాసుల విషయంలోనూ గందరగోళం నెలకొంది.

సనాతన ధర్మ పరిషత్‌కు సాధు, సంతుల మద్దతు

తిరుపతిలో మద్యం, మాంసం విక్రయాలను నిషేధించాలని విజ్ఞప్తి

తిరుపతి (కల్చరల్), అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల ప్రస్తావిస్తున్న సనాతన ధర్మపరిషత్ ఏర్పాటును స్వాగతిస్తున్నట్లు పలువురు సాధు, సంతులు ప్రకటించారు.తిరుపతిలో శనివారం జరిగిన జాతీయ హిందూ ధార్మిక సదస్సులో పాల్గొన్న ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి మాట్లాడుతూ.. హిందూ ధర్మ రక్షణకు, అక్రమ మత మార్పిడుల నివారణకు, ఆలయాల నిర్వహణకు, ధర్మ పరిరక్షణకు సనాతన ధర్మపరిషత్ ఏర్పాటు ఎంతో అవసరమన్నారు. జాతీయ స్థాయిలో ఇటువంటి బోర్డు ఏర్పాటుకు కృషిచేయాలని సాధువులు, పీఠాధిపతులు, మఠాధిపతులు విజ్ఞప్తి చేస్తున్నారని, ఇందుకోసం ప్రయత్నిస్తున్న ఏపీ ఉపముఖ్యమంత్రికి తాము మద్దతుగా నిలుస్తామన్నారు. రాష్ట్రంలో గత పాలకులు ఆలయాలను నిర్వీర్యం చేశారని, ప్రస్తుత ప్రభుత్వం వాటిని చక్కదిద్దేప్రయత్నం చేస్తోందన్నారు. దేవస్థానాల పాలకమండళ్లలో తప్పనిసరిగా సాధువుల నుంచి ఒకరికి సభ్యత్వం ఇవ్వాలని ఆయన డిమాండు చేశారు.ఇతర మతస్తులకు మక్కా, వాటికన్ నగరాల మాదిరిగా హిందువులకు తిరుపతిని పవిత్ర పుణ్యక్షేత్రంగా గుర్తించాలని, ఇక్కడ మద్యం, మాంసం విక్రయాలను పూర్తిగా నిషేధించాలని సదస్సు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. **హిందువులకు వేంకటేశ్వరస్వామి ఆరాధ్య దైవమని, ఆయన సన్నిధిలో అన్యమతస్తులు పనిచేయడాన్ని అరికట్టాలని కోరింది.** ఏపీ సాధు పరిషత్ గౌరవ అధ్యక్షుడు అట్లూరి నారాయణ రావు, తెలంగాణ సాధుపరిషత్ అధ్యక్షుడు శివానంద స్వామి, శంకర స్వామి, దేవానంద జీయర్, కామాఖ్యాపీఠానికి చెందిన భైరన్ గౌరవ్ స్వామి, నిరంజన్, తుమ్మా ఓంకార్ తదితరులు ప్రసంగించారు. రోజంతా జరిగిన ఈ ధార్మిక సదస్సులో 6 రాష్ట్రాలకు చెందిన మూడు వందలకు పైగా సాధువులు, మఠాధిపతులు, హిందూ ధార్మిక సంస్థల సభ్యులు, భక్తులు, తిరుక్షేత్రాల రక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.



జాతీయ హిందూ . దార్మిక సదస్సులో పాల్గొన్న సాధు, సంతులు

రేపు జిల్లా ఇన్‌చార్జి మంత్రి తిరుపతి రాక

తిరుపతి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఈనెల 28వ తేదీన తిరుపతి రానున్నారు. రెండురోజుల పర్యటనలో భాగంగా సోమవారం తిరుపతి చేరుకోనున్న రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్ తొలిరోజు కూటమి పార్టీల నేతలతో సమావేశం కానున్నారు. మరుసటి రోజు జిల్లా అభివృద్ధి విషయమై కలెక్టర్‌తో సమీక్షించనున్నారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు తిరుచానూరు రోడ్డులోని గ్రాండ్ రిడ్జ్ హోటల్‌లో జిల్లాకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీల ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలతో సమావేశం కానున్నారు. మంగళవారం కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమై అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రాజెక్టులు, నిధుల కేటాయింపు వంటి అంశాలపై దిశా నిర్దేశం చేయనున్నారు.

టీడీపీ కార్యకర్త హత్య కేసులో 14 మంది అరెస్ట్

చిల్లకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాంచారమ్మపేట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త హరిప్రసాద్ హత్య కేసులో 14 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఏఎస్పీ రవిమనోహరచారి శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆ వివరాలు వెల్లడించారు. ఈనెల 22వ తేదీన వేకువన గ్రామానికి చెందిన కొంతమంది వైసీపీ నాయకులు గ్రామంలోని హరిజనవాడకు చెందిన కొంతమందితో కలిసి అరుంధతీయవాడకు చెందిన టీడీపీ కార్యకర్తలైన కాటయ్య, హరిప్రసాద్‌లను హత్యచేసేందుకు కుట్రపన్నారన్నారు. కాటయ్య, హరిప్రసాద్ ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటి ముందు ఉన్న మోటారుసైకిల్‌ను పెట్రోలు పోసి తగలబెట్టారన్నారు. కాటయ్య, హరిప్రసాద్ నిద్రిస్తున్న ఇంట్లోకి పెట్రోల్ సీసాలకు నిప్పంటించి వారిపై విసిరి హత్యాయత్నం చేయగా కాటయ్య, హరిప్రసాద్ మంటలను తట్టుకోలేక బయటకు రావడంతో వారిపై కత్తులతో దాడి చేశారన్నారు.




పట్టుపడిన నిందితులతో ఏఎస్పీ రవిమనోహరచారి, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు

కాటయ్య సమీప పొలాల్లోకి పారిపోగా హరిప్రసాద్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. హరిప్రసాద్ హత్యకేసులో నిందితులైన మండలంలోని ముత్యాలపాడు గ్రామానికి చెందిన కట్టా రామిరెడ్డి, నాంచారమ్మపేట గ్రామానికి చెందిన దుంపాల మధు కుమార్, దుంపాల డేనియల్, మన్నెం మోజేస్, ముత్యాలపాడు గ్రామానికి చెందిన చిట్టేటి దినేష్‌రెడ్డి, నాంచారమ్మపేట గ్రామానికి చెందిన మన్నెం శీనయ్య, మన్నెం మనెయ్య, దుంపాల సాయికృష్ణ, పనబాక మనోజ్‌కుమార్, కోట మండలం వంజివాక గ్రామానికి చెందిన పామల విష్ణు, తిమ్మినాయుడుపాళెం గ్రామానికి చెందిన కదూరు విశాల్, అల్లంపాడు గ్రామానికి చెందిన దుంపాల ఏసు, చిల్లకూరు మండలం నాంచారమ్మపేటకు చెందిన దుంపాల చెంగమ్మ, ముత్యాలపాడుకు చెందిన నారపరెడ్డి వెంకట కృష్ణారెడ్డిలను అరెస్ట్ చేశామని వివరించారు. మండలంలోని చింతవరం- కోట రోడ్డులో ఏడుగురిని, ముత్యాలపాడు సమీపంలోని ఏఎంసీ గోదాము వద్ద ఏడుగురిని అరెస్ట్ చేశామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రమణకుమార్, చెంచుబాబు, సీఐలు కిషోర్‌బాబు, హుస్సేన్‌బాషా, శేఖర్‌బాబు, బాబి, మురళీకృష్ణ, ఎస్ఐ సురేష్‌బాబు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

థ్యాంక్యూ అంజిరెడ్డి!

పుంగనూరులో తొడగొట్టి టీడీపీ శ్రేణులకు మనోధైర్యమిచ్చిన కార్యకర్తతో చంద్రబాబు



పుంగనూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచకాలను ఎదిరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో పుంగనూరులో నామినేషన్ వేస్తుండగా అడ్డుకున్న వైసీపీ వారిపై ఎదురుతిరిగి తొడగొట్టి అంజిరెడ్డి టీడీపీ శ్రేణులకు మనోధైర్యమిచ్చారని సీఎం చంద్రబాబు ప్రశంసించారు. శనివారం మంగళగిరి టీడీపీ ప్రధాన కార్యాలయం నుంచి సీఎం చంద్రబాబు టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి కొంతమందితో జూమ్ కాల్‌లో మాట్లాడారు. పుంగనూరు మండలం మార్లపల్లెకు చెందిన అంజిరెడ్డి టీడీపీ సభ్యత్వం నమోదు అనంతరం వారి మనుమడి సహాయంతో జూమ్‌లో మాట్లాడారు. తనకు 84 ఏళ్ల వయసు ఉండగా 42సంవత్సరాలు టీడీపీలో సీనియర్ కార్యకర్తగా ఉన్నాను. ఏనాడూ నేను పదవులు ఆశించలేదని, ఈ ఏడాది జూన్ 11వ తేది విజయవాడలో నారా లోకేశ్‌ను కలిసి తనకు పదవి ఇవ్వాలని కోరగా ఆయన నీకు మంచిపదవే ఇస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు ఇవ్వలేదని, చంద్రబాబు పదవి ఇప్పించాలని కోరారు. రాబోవు రోజుల్లో టీడీపీ అధికారంలోకి రావడానికి యువకులు ముందుకు రావాలని, తాను ముసలివాడిని అయినా పార్టీ కోసం పోరాడుతూ పనిచేశానని, ఎక్కడా డబ్బు, బెదిరింపులు, ప్రలోభాలకు లొంగలేదని, ఆడ,మగ తేడాలేకుండా అందరూ పార్టీ సభ్యత్వం తీసుకుని తెలుగుదేశం పార్టీకి బలం చేకూర్చాలని అంజిరెడ్డి చెప్పారు. అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ పుంగనూరు వైసీపీ అరాచకాలతో స్థానిక ఎన్నికల్లో నామినేషన్ వేయకుండా దౌర్జన్యం చేయగా ప్రాణాలకు లెక్కచేయకుండా వృద్ధుడైనా ధైర్యంగా ముందుకు వెళ్లగా ఆయనపై దౌర్జన్యం చేసి నామినేషన్ పేపర్లు చింపివేయగా వైసీపీ వారిని తొడగొట్టి హెచ్చరించారని, థ్యాంకూ అంజిరెడ్డి అన్నారు. పార్టీ కోసంకష్టపడిన ఇలాంటి వారు చాలా మంది ఉన్నారని, పార్టీ అధికారంలోకి రాగానే అందరూ పదవులపై ఆశలు పెట్టుకున్నారని, అందరికీ పదవులు ఇవ్వడం కష్టమన్నారు. టీడీపీ శాశ్వతంగా ఉండాలని, అందరినీ సమన్వయం చేసుకుని అవకాశాల మేరకు పదవులు దక్కుతాయన్నారు.

లోకేశ్‌పై భువనమ్మ పోటీ!



కుప్పంలో మహిళా కార్యకర్త చేత క్రియాశీలక సభ్యత్వం నమోదు చేయిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇదేంటిది.. స్వయానా కుమారుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌పై ఆయన తల్లి భువనేశ్వరి పోటీ పడడమేమిటి? అయినా పడాలన్నా, ఇప్పట్లో ఎన్నికలు లేవు కదా.. అని అయోమయం చెందకండి. కానీ లోకేశ్‌పై భువనమ్మ పోటీ పడుతున్నారన్న మాట మాత్రం నిజం. అయితే ఎన్నికల్లో కాదు.. పార్టీ సభ్యత్వ నమోదులో. ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు తరఫున ఆమె సభ్యత్వ నమోదులో కుమారుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌తో పోటీ పడుతున్నారు. బాబు నియోజకవర్గమైన కుప్పంలో, కుమారుడి నియోజకవర్గమైన మంగళగిరికంటే అధికంగా పార్టీ సభ్యత్వ నమోదు జరగాలని కోరుకుంటున్నారు. కుప్పం నియోకవర్గ టీడీపీ సమన్వయకర్త, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఈ విషయాన్ని వెల్లడించారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని కమతమూరులో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదును ప్రారంభించిన ఆయన, అనంతరం జరిగిన సభావేదిక నుంచి ఈ విషయాన్ని వెల్లడించారు. 'లోకేశ్‌గారి మంగళగిరి నియోజకవర్గం కంటే చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న మన కుప్పం నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు అధికంగా జరగాలి. భువనమ్మ ఈ విషయాన్ని నాకు స్పష్టంగా చెప్పారు. ఎక్కడా తగ్గకుండా, సభ్యత్వ నమోదులో దూసుకుపోవాలని నిర్దేశించారు.' అని ఎమ్మెల్సీ ప్రకటించారు. కుప్పం నియోజకవర్గ పరిధిలో గతేడాది 78 వేల సభ్యత్వాలను నమోదు చేశామని, ఈసారి ఈ సంఖ్య లక్ష దాటాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సభలో పాల్గొన్న ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ సహా పలువురు వక్తలు కూడా మంగళగిరి కంటే కుప్పంలో సభ్యత్వ నమోదు ఎక్కువగా చేయాలని, చేస్తామని ఆత్మ విశ్వాసం వ్యక్తం చేయడం విశేషం.

బందోబస్తు మధ్య పుంగనూరు మండల మీట్





పుంగనూరు ఎంపీడీవో కార్యాలయం ముందు పోలీసులకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ ప్రభాకర్, సీఐ శ్రీనివాసులు - సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు రూరల్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం భారీ బందోబస్తు మధ్య శనివారం ప్రశాంతంగా జరిగింది. ప్రజలచే ఎన్నిక కాకుండా వైసీపీ దౌర్జన్యంగా నామినేటెడ్ తరహాలో పదవులు పొందినవారు ఆ పదవుల్లో కొనసాగేందుకు అనర్హులని టీడీపీ కూటమి నేతలు అడ్డుకోవడంతో మండల మీట్‌లు వాయిదా పడ్డాయి. శనివారం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా మండల్‌మీట్ నిర్వహించేలా పలమనేరు డీఎస్పీ ప్రభాకర్, పుంగనూరు సీఐ శ్రీనివాసులు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంపీడీవో కార్యాలయం, పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేయగా చిత్తూరు నుంచి భాష్పవాయువు ప్రయోగానికి వజ్ర వాహనం, ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎంపీపీ భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు. కార్యక్రమాలు ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని సూచించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై వైద్యులు ఏమి చర్యలు తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యసిబ్బంది సక్రమంగా గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. రైతులకు ఉలవలు ఇచ్చే సమయంలో ప్రజాప్రతినిధులకు చెప్పకుండా అధికారులు ప్రవర్తించడం సరికాదన్నారు. ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు డొక్కా సీతమ్మ భోజన పథకంలో మార్పులు చేయడానికి పాఠశాలల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నివేదిక తయారు చేసి కలెక్టరుకు అందజేసినట్లు తెలిపారు. బోడేవారిపల్లె ఎంపీటీసీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నాడు-నేడు పథకంలో నిర్మించిన పాఠశాలల భవనాలు సగంలో నిలిచిపోగా వాటిని పూర్తి చేయాలని కోరారు. గుడిసిబండ ఎంపీటీసీ నాగరాజ మాట్లాడుతూ గుడిసిబండ, కపాడమిట్టపల్లె గ్రామాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందని వెంటనే పరిష్కరించాలన్నారు. బాలగురవయ్యగారిపల్లెలో పారిశుధ్య పనులు చేయాలని కోరారు. నెక్కుంది సర్పంచ్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఇటుకనెల్లూరు, నెక్కుంది గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. సింగిరిగుంట సర్పంచ్ ఆంజప్ప మాట్లాడుతూ మార్లపల్లె, సింగిరిగుంట గ్రామాల్లో తాగునీటి సమస్య తీర్చాలని కోరారు. విద్యుత్ ఏఈ ధనంజయ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సూర్యఘర్ పథకం సబ్సిడీ ధరలతో ఇళ్లపై సోలార్ ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. ఎంపీడీవో లీలామాధవి మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి కోసం 10బోర్లు వేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, మంజూరుకాగానే తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో బోర్లు వేస్తామన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి ఆయుధాల ప్రదర్శనను తిలకిస్తున్న ఎస్పీ



ఫింగర్ ప్రింట్ గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఎస్పీ మణికంఠ



ఫింగర్ ప్రింట్స్ తీసుకుంటారిలా..!

విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఫింగర్ ప్రింట్స్ తీసుకోవడంపై విద్యార్థులకు ఎస్పీ మణికంఠ అవగాహన కల్పించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినంలో భాగంగా శనివారం ఏఆర్ పోలీసు మైదానంలో ఆయుధాల ప్రదర్శనను ఆయన ప్రారంభించి, విద్యార్థులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలీసు వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించడానికే ఈ ప్రదర్శన అన్నారు. డాగ్, డిటెక్షన్ స్క్వాడ్, కమ్యూనికేషన్, ఫింగర్ ప్రింట్, క్లూస్ టీమ్, ట్రాఫిక్, సైబర్ క్రైమ్, పోలీసు వాహనాలను ప్రదర్శనలో ఉంచారు. ఇందులో సైబర్ క్రైమ్ స్టాల్, పోలీసు వాహనాల్లో ఫాల్కన్ వాహనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆయుధాల పనితీరు విద్యార్థులకు ఏఆర్ సిబ్బంది వివరించారు. కాగా, జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో విద్యార్థులకు, పోలీసు కుటుంబాల పిల్లలకు, పోలీసు ఉద్యోగులకు సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర- పోలీసుల సవాళ్లు అనే అంశాలపై కాన్ఫరెన్స్ హాలులో వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు.

పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలి: ఎస్పీ

చిత్తూరు అర్బన్, అక్టోబరు 26: పాత నేరస్తులపై పోలీసులు నిఘా ఉంచి ఎప్పటికప్పుడు వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని ఎస్పీ మణికంఠ ఆదేశించారు. నెలవారీ సమీక్షలో భాగంగా శనివారం జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజిబుల్ పోలీసింగ్, ఎర్రచందనం స్మగ్లింగ్, సారా తయారీ, ఇసుక అక్రమ రవాణా తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. అలాగే పాత కేసులు, గ్రేవ్, నాన్‌గ్రేవ్, మిస్సింగ్, చీటింగ్ తదితర కేసులపై సమీక్షించారు. గంజాయి రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. సమాజంలో జరిగే నేరాలపై గ్రామాల్లో మహిళలు, విద్యార్థినులకు అవగాహన కల్పించాలన్నారు. మాదకద్రవ్యాలను సేవించడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సులను నిర్వహించాలన్నారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఎంపీటీసీ కిడ్నాప్, మృతి కేసులో 10మంది అరెస్ట్


గంగాధరనెల్లూరు,అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కిడ్నాప్‌కు గురై అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన టీడీపీ ఎంపీటీసీ జగన్నాథరాజు కేసులో 10మంది నిందితులను గంగాధరనెల్లూరు పోలీసులు అరెస్ట్ చేశారు.సీఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు..పాలసముద్రం మండలం టీవీఎస్‌ఆర్ పురానికి చెందిన టీడీపీ ఎంపీటీసీ జగన్నాథరాజు స్నేహితులు చిన్నమరాజు, ఏకాంబరంతో కలిసి కారులో ఈనెల 21వతేది సాయంత్రం గంగాధరనెల్లూరు మండలం అంబోదరపల్లె సమీపంలో వెళుతుండగా మూడు వాహనాల్లో కొందరు వెంబడించి అటకాయించారు. జగన్నాథరాజును కారులో నుంచి బలవంతంగా దింపి తమ కారులోకి ఎక్కించారు. ఏకాంబరం, చిన్నమరాజుతో పాటు డ్రైవర్ శంకర్‌ను రెండు వాహనాల్లో ఎక్కించుకుని బంగారెడ్డిపల్లె పంచాయతీ సమసిరెడ్డిపల్లె వరకు ప్రయాణించారు.అక్కడ ఏకాంబరం, చిన్నమరాజు, శంకర్‌లను దింపేశారు. జగన్నాథరాజును నూజివీడుకు తరలిస్తుండగా 22వతేది తెల్లవారుజామున ముసనూరు మండలం కాట్రేనిపాడు గ్రామం వద్ద అప్పు తీసుకున్న వాహనాల నెలవారీ కంతులు కట్టాలని, లేదంటే వాహనాలను తమకు స్వాధీనం చేయాలని ఒత్తిడిచేశారు. దీంతో ఒత్తిడికిలోనైన జగన్నాథరాజు కాలకృత్యాలకు వెళ్లొస్తానని చెప్పి పొలాల్లోకి పారిపోయాడు. కొంతదూరం పోయిన తర్వాత అతను స్పృహతప్పిపడిపోయిఉండటాన్ని గమనించిన కిడ్నాపర్లు నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించగా చనిపోయాడని తెలిసి డ్రైవర్ శంకర్‌కు సమాచారం ఇచ్చారు.ఈ కేసులో ప్రధానంగా జేసీబీలు విక్రయించే ఏలూరు జిల్లాకు చెందిన లక్కోజి సతీష్, అనపర్తి అనిల్ కుమార్ ద్వారా జగన్నాథరాజు ఫైనాన్స్‌లో జేసీబీ, ఫోర్డ్‌కారు తీసుకుని నెలసరి వాయిదాలు కట్టకపోవడంతో కిడ్నాప్‌కు పాల్పడినట్లు సీఐ తెలిపారు.కర్నూలు జిల్లాకు చెందిన బోయ వీరేష్(22), దాసరయ్యగారి పెద్దయ్య (48), ఏలూరు జిల్లాకు చెందిన గుత్తి నాగరాజు(34),దాసరి చంద్రయ్య (43), సత్యబాబు (24), శ్రీకాకుళం జిల్లాకు చెందిన లంక మణికంఠ(26), విజయనగరం జిల్లాకు చెందిన గుడివాడ ఆదర్శ్ (20), గుడివాడ మణికంఠ (22),తూర్పు గోదావరి జిల్లాకు చెందిన శివసత్యనారాయణ (27),అనిల్‌కుమార్ (32)లను 26వతేదిన చిత్తూరు కట్టమంచి చెరువు వద్ద అరెస్ట్ చేశామని, వారు ప్రయాణించిన కార్లను పూతలపట్టు సమీపంలో స్వాధీనం చేసుకున్నామని సీఐ వెల్లడించారు. కేసును ఛేదించిన సీఐ లక్ష్మీనారాయణ, సిబ్బందిని ఎస్పీ మణికంఠ అభినందించారు.

కాణిపాకంలో ఖోఖో పోటీలు

ఐరాల(కాణిపాకం),అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో నిర్వహిస్తున్న 43వ రాష్ట్ర స్థాయి ఖోఖో చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. శనివారం జరిగిన బాలికల విభాగంలో.. కృష్ణాపై 10-5 తేడాతో పశ్చిమగోదావరి జట్టు విజయం సాధించింది. చిత్తూరుపై 10-9 తేడాతో నెల్లూరు జట్టు గెలిచింది. శ్రీకాకుళం జట్టుపై ప్రకాశం జట్టుపై 7-5 తేడాతో విజయం సాధించింది. ఈస్టు గోదావరి జట్టు.. కర్నూలు జట్టుపై 9-1తో విజయం సాధించింది.

మొగిలి ఘాట్‌లో లారీ, ద్విచక్ర వాహనం ఢీ

● యువకుడి దుర్మరణం, మరొకరికి గాయాలు



హేమచంద్ర (ఫైల్‌ఫొటో)

బంగారుపాళ్యం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొగిలి ఘాట్‌లో లారీ, ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంగవరం మండలం మబ్బులపేట గ్రామానికి చెందిన మోహన్ కుమార్ కుమారుడు హేమచంద్ర (22) శనివారం సాయంత్రం తిరుపతికి బయల్దేరాడు. మార్గమధ్యంలో బంగారుపాళ్యంకు చెందిన అభిషేక్ లిఫ్ట్ అడిగాడు. అతడిని ఎక్కించుకున్నాక.. ఇద్దరూ కలిసి పలమనేరు నుంచి బంగారుపాళ్యంకు బయల్దేరారు. చెన్నై - బెంగళూరు జాతీయ రహదారి మొగలిఘాట్‌లోని దొరచెరువు వద్దకొచ్చేసరికి ముందు వెళ్తున్న లారీ స్పీడ్ బ్రేకర్ వద్ద ఉన్నట్టుండి ఆగడంతో వెనుక వస్తున్న హేమచంద్ర తన ద్విచక్ర వాహనాన్ని అదుపు చేయలేక ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో హేమచంద్ర అక్కడికక్కడే మృతిచెందగా, అభిషేక్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తుచేస్తున్నారు.

చిత్తూరులో నేడు 'జోస్ ఆలుక్కాస్' ప్రారంభం

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని పలమనేరు రోడ్డు రెడ్ క్రాస్ బిల్డింగ్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన జోస్ ఆలుక్కాస్ జ్యువెలరీ షోరూమ్‌ను సినీనటి ఐశ్వర్య రాజేష్ ఆదివారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు షోరూమ్ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రారంభం సందర్భంగా నగల కొనుగోలుదారులకు రూ.50వేల విలువైన బంగారు నాణెం ఉచితంగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

'రీ సర్వే' గ్రామసభల్లో అర్జీల వెల్లువ: డీఆర్వో

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): భూరీసర్వేలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి చేపట్టిన గ్రామ సభల ద్వారా శనివారం నాటికి 6,222 అర్జీలు అందాయని డీఆర్వో పుల్లయ్య తెలిపారు. శనివారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రెవెన్యూ రికార్డుల్లో కచ్చితత్వం, భూవివాదాల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం ఈనెల 22వ తేదీనుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రీసర్వే జరిగిన 329 గ్రామాలకుగాను ఐదురోజుల్లో 129 పంచాయతీల్లో గ్రామసభలు జరిగాయన్నారు. 6,222 అర్జీలు అందగా, 14 అక్కడికక్కడే పరిష్కరించడం జరిగిందని చెప్పారు. కొన్ని భూముల వివరాలను అసలు నమోదు చేయకపోవడం, అడంగల్‌లో ఉన్న విస్తీర్ణం కంటే కొందరికి తక్కువగా, ఇంకొందరికి ఎక్కువగా నమోదు చేయడం, వ్యాలిడేషన్ ప్రక్రియ తర్వాత చాలామంది రైతులకు నోటీసులు ఇవ్వకపోవడం వంటి తప్పులు రీసర్వేలో జరిగాయని తెలిపారు.

రేపట్నుంచి ఏవోయూ డిగ్రీ సెకండ్ సెమిస్టర్

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ (ఏవోయూ) 2వ సెమిస్టర్ పరీక్షలు సోమవారం నుంచి నవంబరు 4వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ మేరకు సెంటర్ కోఆర్డినేటర్ మీరాసాహెబ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 73829 29664, 95736 07925 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

వలస కార్మికులకు రేషన్ కార్డులు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వలస వచ్చి మన జిల్లాలో ఉంటున్న కార్మికులందరికీ రేషన్‌కార్డులు మంజూరుకు ప్రభుత్వం సిద్ధమైందని జేసీ విద్యాధరి తెలిపారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలో 980 వలస కార్మికులను ప్రభుత్వం గుర్తించి వారి వివరాలను జాబితా రూపంలో అందజేసిందన్నారు. ఈ జాబితాలను జిల్లాలో తహసీల్దార్లందరికీ పంపడం జరిగిందన్నారు. సోమవారంలోగా వీరిని గుర్తించి.. ఆధార్‌కార్డుల లేని పేర్లను అప్‌డేట్ చేయాలని సూచించారు. వాటి ఆధారంగా కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేస్తామని వివరించారు.

4,459 మందికి ఆధార్ అప్‌డేషన్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక శిబిరాల ద్వారా నాలుగు రోజుల్లో 4,459 మంది తమ ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేసుకున్నారని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆధార్‌కార్డులు తప్పనిసరి అన్నారు. ఆధార్‌కార్డులు లేని 371 మందికి కొత్త కార్డుల మంజూరు, 5-7, 15-17 ఏళ్లమధ్య ఉన్న బాలబాలికల బయోమెట్రిక్ అప్‌డేషన్ కోసం 1,531 దరఖాస్తులు అందాయని, ఇతరులు 493 మంది బయోమెట్రిక్ చేసుకున్నారని తెలిపారు. ఆధార్‌తో సెల్‌ఫోన్ లింకు, ఈ-మెయిల్ లింకు, డాక్యుమెంట్ అప్‌డేషన్, పేరు, చిరునామా, పుట్టిన తేదీ, లింగ మార్పులకు 2,043 మంది దరఖాస్తుల ద్వారా అప్‌డేట్ చేసుకున్నారని వివరించారు.

వేటగాళ్ల ఉచ్చులో పడి అడవి పంది మృతి

తవణంపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వేటగాళ్ల ఉచ్చులో పడి ఓ అడవి పంది మృతి చెందింది. తవణంపల్లె మండలంలోని మారేడుపల్లె గ్రామ సమీపంలో ఉన్న వాగు వద్ద గుర్తు తెలియని వ్యక్తులు అడవి పందుల వేట కోసం కరెంటు తీగలతో ఉచ్చు ఏర్పాటు చేశారు. ఈ ఉచ్చులో శనివారం వేకువ జామున అడవి పంది చిక్కుకుని మృతి చెందింది. తీగలు పంది కళేబరానికి చుట్టుకోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ విషయాన్ని విద్యుత్ సిబ్బంది గుర్తించి పోలీసులకు, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకని, అడవి పంది మృతిపై పంచనామా నిర్వహించారు. కళేబరాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ఇదిలా ఉంటే.. ఈ సంఘటనకు సంబంధించి నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

ఉర్దూ డీఐగా అఫ్సర్ ఖాన్



చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ చిత్తూరు జిల్లా ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ (డీఐ)గా రామకుప్పం జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అఫ్సర్‌ఖాన్‌ను ప్రభుత్వం నియమించింది. 1997లో ఎస్జీటీ ఉర్దూ ఉపాధ్యాయుడిగా నియమితులైన ఈయన 2001లో స్కూల్ అసిస్టెంట్‌గా, 2021లో గ్రేడ్2 హెచ్‌ఎంగా పదోన్నతి పొందారు.

నేడు పుంగనూరులో సన్నుతి రామమూర్తి విగ్రహావిష్కరణ



సన్నుతి రామమూర్తి(ఫైల్)

పుంగనూరు రూరల్, అక్టోబరు 26: పుంగనూరు శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఆదివారం ఉదయం 11గంటలకు కాలేజీ స్థలదాత, శుభారాం ట్రస్టు వ్యవస్థాపకులు దివంగత సన్నుతి రామమూర్తి విగ్రహావిష్కరణ జరుగుతుందని ట్రస్టు ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ట్రస్టు సభ్యులు, ఆర్యవైశ్యులందరూ బజారువీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో పూజలు చేసుకుని కాలేజీ వద్దకు వెళ్లాలని ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కె.బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. విగ్రహావిష్కరణ అనంతరం శుభారాం ట్రస్టు, మూర్తిగ్లాసు, ప్రైవుడ్ బెంగళూరు వారు కాలేజీకి 15 కంప్యూటర్లు అందిస్తారని తెలిపారు. కావున పట్టణంలోని కాలేజీ విద్యార్థులు, అధ్యాపకులు, పూర్వవిద్యార్థులు హాజరుకావాలని కోరారు.

చోరీ నిందితుడి అరెస్టు

79 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం



దొంగ అరెస్టును చూపుతున్న పోలీసులు

సదుం, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): సదుం బస్టాండులో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ నెల 5న వీఆర్ఆర్ కాలనీలో నివసిస్తున్న పంచాయతీ సిబ్బంది చిరంజీవి ఇంటి తాళాలు పగలగొట్టి 22గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. అలాగే పెనుమూరులో 22 గ్రాములు, కలికిరిలో 35 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి పాల్పడ్డాడని, అతనిపై 15కేసులు నమోదైనట్లు ఎస్ఐ షేక్ షావలి తెలిపారు. అతని నుంచి ఆ బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని పీలేరు కోర్టులో హాజరు పరిచినట్లు ఆయన తెలిపారు.

ఫ్రీహోల్డ్ రీ సర్వే పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

రొంపిచెర్ల, అక్టోబరు 26: (ఆంధ్రజ్యోతి) : డీకేటీ భూముల ఫ్రీ హోల్డ్ రీ సర్వే కార్యక్రమాన్ని ఈనెల 30వ తేదిలోపు పూర్తి చేయాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐలు, సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏతో సమావేశం నిర్వహించారు. రైతులు రెవెన్యూ అధికారులకు తమ డ్యాకుమెంట్స్ సమర్పించి ఫ్రీ హోల్డ్ సర్వేకి సహకరించాలన్నారు. రొంపిచెర్ల పంచాయతీ ఎస్టీ ఆర్ కాలనీ దారి సమస్య పరిష్కరించి సీసీ రోడ్డు ఏర్పాటుకు చర్య తీసుకున్నామన్నారు. ఆర్ఐ సధాకర్‌నయక్, సర్వేయర్ ద్వారక, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి విరాళం



పలమనేరు, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి) : పెద్దపంజాణి మండల అమరన్న యువసేన నాయకుడు సునీల్ రెడ్డి ఎన్నికల సందర్భంగా అమరనాథరెడ్డిని గెలిపిస్తే తాను ఆలయాల అభివృద్ధికి ఆర్థికసాయం అందజేస్తానని పలు గ్రామాల ప్రజలకు హామీ ఇచ్చారు. ఎన్నికల్లో అమరనాథరెడ్డి గెలుపొందడంతో శనివారం పలమనేరు టీడీపీ కార్యాలయంలో పెద్దపంజాణి మండలంలోని వీరప్పల్లి సుబ్రమణ్యస్వామి ఆలయం అభివృద్ధికి రూ.లక్ష, మారపల్లిలోని గంగమ్మ ఆలయానికి రూ.20వేలు, బొమ్మలగుంట గంగమ్మ గుడికి రూ.30వేలు, మద్దలగుంట వెంకటేశ్వర స్వామి ఆలయానికి రూ.50వేలు, మొత్తం రూ.2లక్షలను విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని చెక్కుల రూపంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

పుంగనూరు సబ్‌కోర్టును తనిఖీ చేసిన జిల్లా జడ్జి



మాట్లాడుతున్న న్యాయమూర్తి భీమారావు

పుంగనూరు రూరల్, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): పుంగనూరు సబ్‌కోర్టును జిల్లా జడ్జి భీమారావు శనివారం తనిఖీ చేశారు. కోర్టు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం న్యాయవాదులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుంగనూరుకు త్వరలోనే న్యాయమూర్తులు బాధ్యతలు తీసుకుంటారని, న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో జడ్జి శిరీష్, న్యాయవాదుల సంఘనాయకులు చెన్నకేశవులు, బాలాజీ, ఆనంద్‌కుమార్, శరత్‌కుమార్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

బందార్లపల్లెక్రాస్‌లో రోడ్డు మరమ్మతులు



రామకుప్పం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని బందార్లపల్లె క్రాస్ నుంచి దిగువ రైస్‌మిల్లు వరకు గల రహదారి దుస్థితిపై పంచాయతీ అధికారులు స్పందించారు. రహదారి అగుగడుగునా గుంతలమయంపై వర్షపునీరు రోడ్డుపైనే నిల్వ ఉంటూ రాకపోకలకు కలుగుతున్న ఇబ్బందులపై శనివారం ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పంచాయతీ అధికారులు శనివారం పొక్లెయిన్ ద్వారా రోడ్డు నిర్వహణ పనులు చేపట్టారు. వర్షపునీరు నిల్వ ఉండకుండా రోడ్డుకిరువైపులా కందకాలు తీయించారు.

ముమ్మరంగా బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

పుంగనూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వం ముమ్మరంగా చేస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు సీఎస్.రాజారెడ్డి, మదన్ మోహన్ తెలిపారు. శనివారం పుంగనూరులో పలుప్రాంతాల్లో సభ్యత్వ నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 40 రోజులుగా జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈనెల 31వ తేదీకి పూర్తి అవుతుందన్నారు. 50 మందిని సభ్యులుగా చేర్పిన వారికి క్రియాశీలక సభ్యత్వ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రమేశ్‌నాయుడు, ఆకుల కృష్ణమూర్తి, మల్లికారాణి, నరసింహులు, మఠం బాబు, ఆదినారాయణ, మనోహర్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



శాంతిపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పారిశుధ్య కార్మికులకు శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు దీపావళి పండుగను పురస్కరించుకుని కొత్త దుస్తులను పంపిణీ చేశారు. మండలంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను జయప్రదం చేసిన పారిశుధ్య సిబ్బందిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో సర్పంచు జయరాం, మాజీ వైస్ఎంపీపీ ఉదయ్‌కుమార్, రెస్కో మాజీ వైస్ చైర్మన్ చలపతి స్వామి, ఎంపీడీఓ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పలమనేరు సమస్యలను పరిష్కరించాలి

పలమనేరు, అక్టోబరు26 : పలమనేరులో నెలకొన్న సమస్యలనే వెంటనే పరిష్కరించాలని కోరుతూ శనివారం పలమనేరు పరిరక్షణ సమితి నాయకులు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. పలమనేరు గంగమ్మ గుడివీధిలో ఆక్రమణలు తొలగించాలని, అంబేడ్కర్ సర్కిల్ నుంచి గుండుబావివరకు జాతీయరహదారిపై అక్రమంగా పార్కింగ్ చేసే ఆటోలు, టాక్సీలు, వాహనాలను తొలగించాలని, గుడియాత్తం రోడ్డుపక్కన తవ్వి వదిలేసిన మురుగునీటి కాలువను వెంటనే నిర్మించాలని కోరారు. రంగబాబు సర్కిల్ వద్ద చికెన్ షాపు నిర్వాహకులు కోళ్లను అంగళ్లముందు కేజెస్‌లో రోడ్డు వరకు పెట్టారని, దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలమనేరు పరిరక్షణ సమితి అధ్యక్షులు సుబ్రమణ్యంపిళ్లై, కార్యదర్శి నరసింహులు, సభ్యులు పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

రేపు పులిచెర్ల మండల మీట్

కల్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పులిచెర్లలో ఈనెల 28న ఉదయం 10:30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజశేఖర్‌బాబు తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా : కంచర్ల





సభ్యత్వ నమోదు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల, రొంపిచెర్లలో టీడీపీ నమోదు చేసుకుంటున్న చల్లాబాబు

కుప్పం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశంపార్టీ కార్యకర్తలతోపాటు యువకులు, వివిధ వయసుల వారు కూడా పార్టీ సభ్యత్వం తీసుకోవాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వం తీసుకోవడంవల్ల కార్యకర్తలకు రాజకీయంగానే కాక, ఆర్థికంగా కూడా భరోసా లభిస్తుందన్నారు. కుప్పం పురపాలక సంఘం కమతమూరులో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ సర్పంచి వీజీ.ప్రతాప్‌ల పర్యవేక్షణలో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. తొలుత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, పీఎస్ఎంలు మాట్లాడుతూ కార్యకర్తలందరూ రూ.100 చెల్లించి పార్టీ సభ్యత్వం తీసుకోవాలన్నారు. ఈ సారి మొబైల్ యాప్ ద్వారా ఎవరికి వారే సభ్యత్వ రుసుము యూపీఐ యాప్‌లను ఉపయోగించి చెల్లించాల్సి ఉంటుందన్నారు. గతంలో పార్టీ సభ్యత్వం కడితే రూ.5 లక్షలు బీమా లభించేదని, ఇప్పుడా మొత్తాన్ని రూ.10 లక్షలకు చంద్రబాబు పెంచారని చెప్పారు. కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కుప్పం, శాంతిపురం, మండలాల పార్టీ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, విశ్వనాథనాయుడు, పలువురు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోండి

రొంపిచెర్ల : టీడీపీ కుటుంబ సభ్యులుగా చేరేందుకు రూ 100లు చెల్లించి సభ్యత్వం పొందాలని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి కోరారు. శనివారం ఆయన రొంపిచెర్ల పార్టీ కార్యాలయంలో తన సభ్యత్వాన్ని వంద చెల్లించి నమోదు చేసుకున్నారు. అనంతరం బండకిందపల్లె పంచాయతీ మట్లోళ్లపల్లెలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల పార్టీ అధ్యక్షుడు ఉయ్యాలరమణ, అమరనాధరెడ్డి, వెంకట్రమణారెడ్డి, భాస్కరయ్య, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో పలమనేరు ఆదర్శంగా ఉండాలి

● ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి





బైరెడ్డిపల్లెలో సభ్యత్వ నమోదుపై సమావేశం, రామకుప్పంలో సభ్యత్వ నమోదు ప్రారంభం

గంగవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో పలమనేరును ఆదర్శంగా తీసుకొనే స్థాయిలో కృషి చేయాలని ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గ స్థాయిలో మొట్టమొదటి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గంగవరం మండలం మామడుగులో ఎమ్మెల్యే అమర్ ప్రారంభించి, తొలి పార్టీ సభ్యత్వాన్ని ఆయనే తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ చేపడుతున్న ఈ సభ్యత్వ నమోదును నాయకులందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పార్టీకోసం పనిచేస్తున్న వారికి మాత్రమే సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని, సభ్యత్వ నమోదు చేసుకున్న వారందరికీ రూ.5 లక్షల భీమా సదుపాయం ఉంటుందన్న విషయం గుర్తు చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, ప్రతాప్ రెడ్డి, రంగప్ప, హరిబాబు, ప్రకాష్, రాజన్న, బత్తిగౌడు, ప్రసాద్‌నాయుడు, మురళి, జయసింహ, యుగంధర్, గిరిధర్ గోపాల్, పతి, వెంకీ, జనసేన మండల అధ్యక్షుడు చంద్ర, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లెలోని రాయల్ మహల్‌లో శనివారం టీడీపీ సభ్యత్వనమోదు కార్యక్రమానికి సంబంధించి సమావేశం నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు మాట్లాడుతూ మండలంలో సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. అనంతరం పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, జైకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పం : రామకుప్పంలో టీడీపీ సభ్యత్వ నమోదును శనివారం మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ పంచాయతీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, బూత్ ఇన్‌చార్జి మంజునాథ్ పాల్గొన్నారు. విజలాపురం పంచాయతీ అధ్యక్షుడు కుమార్ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో ప్రజలు పార్టీ సభ్యత్వం తీసుకునేలా కార్యకర్తలు, నేతలు కృషి చేయాలని కోరారు. నేతలు శ్రీనివాసులురెడ్డి, వేణుగోపాల్‌గౌడు, విశ్వనాథరెడ్డి, బాబురెడ్డి, బాలకృష్ణ, అమీర్‌జాన్ పాల్గొన్నారు.

అటవీ స్థలంలో వైసీపీ నేత బోరు డ్రిల్లింగ్

బోరు లారీని సీజ్ చేసి పుంగనూరుకు తరలించిన ఫారెస్టు అధికారులు- వైసీపీ నేత, బోరు లారీ యజమానిపై కేసు నమోదు





సీజ్ అయిన బోరు లారీ, బోరు వేస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రేంజర్ శ్రీరాములు

చౌడేపల్లె, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె మండలం కొలింపల్లె వద్ద అటవీ స్థలంలో శుక్రవారం రాత్రి బోరు వేస్తుండగా వైసీపీ నాయకుడిని ఫారెస్టు అధికారులు అడ్డుకుని బోరులారీని సీజ్ చేసి పుంగనూరుకు తరలించారు. బోయకొండ అటవీ ప్రాంతంలో ఆక్రమించిన స్థలంలో కొలింపల్లెకు చెందిన వైసీపీ నాయకుడు పాల గంగిరెడ్డి బోరు డ్రిల్ చేస్తున్నట్లు గ్రామస్థులు సమాచారం ఇవ్వడంతో వెంటనే పుంగనూరు ఎఫ్ఆర్‌వో శ్రీరాములు, సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. బోరు డ్రిల్లింగ్‌ను ఆపించి లారీని సీజ్ చేసి పుంగనూరు రేంజ్ ఆఫీసుకు తరలించారు. గంగిరెడ్డి, లారీ యజమానిపై తాము కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఫ్ఆర్‌వో తెలిపారు. విషయాన్ని జిల్లా అటవీశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లానని, త్వరలోనే బోయకొండ ఫారెస్టుబీటులో అటవీ స్థలాలు ఆక్రమణలపై సమగ్రంగా సర్వే చేయించి స్వాధీనం చేసుకుంటామని ఆయన వివరించారు.వైసీపీ నేత గంగిరెడ్డిని వివరణ కోరగా తమ పట్టా భూమిలోనే బోరు వేస్తున్నామని, తన తమ్ముడు దేవేంద్ర భార్య శ్యామలకు 2023లో సర్వేనంబర్ 641-4లో ఎకరం భూమిని భూ పంపిణీలో ఇచ్చారని, 1బీ, అడంగల్ రికార్డులున్నాయని తెలిపారు.

మామిడిలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి



ప్రసంగిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన రెడ్డి

పలమనేరు, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి) : మామిడి పూత దశలో రైతులు మెలకువలు పాటిస్తే నాణ్యమైన పంటతోపాటు అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదనరెడ్డి సూచించారు. శనివారం పలమనేరు ఆర్డీఓ కార్యాలయంలో కుప్పం, గుడిపల్లి, శాంతిపురం, రామకుప్పం, వి.కోట, బైరెడ్డిపల్లి, పలమనేరు మండలాల రైతు సేవా కేంద్ర సిబ్బందికి మామిడి పూత, పిందె దశల్లో చేపట్టవలసిన సస్యరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మధుసూదనరెడ్డి మాట్లాడు తూ డిసెంబరు రెండవవారంలో పూతంతా ఒకే సారి రావడానికి పొటాషియం నైట్రేట్ (13:00:45)5 గ్రాములు, అర్కామ్యాంగో స్పెషల్ 5 గ్రాములు లీటరు నీటికి కలిసి పిచికారీ చేయాలన్నారు. పూత, మొగ్గ దశలో క్లోరోపైరిపాస్2 మిల్లీలీటర్లు, మాంకోజట్ 2 గ్రాములు లీటరు నీటితో కలిసి పిచికారీ చేయాలన్నారు. పచ్చిపూత దశలో బ్యూప్రోఫెజిన్1.5 మిల్లీ లీటర్లు, హెక్సాకోనజోల్ 2 మిల్లీలీటర్లు, అజాడిరాక్టిన్2 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. తెల్లపూత దశలో ఎలాంటి మందులు పిచికారీ చేయకూడదన్నారు. నల్ల పూత దశలో బ్యూప్రోఫెజిన్, అసిఫేట్1 గ్రాము లీటరు నీటికి థయోఫినేట్ లీటరు నీటికి కలిసి పిచికారీ చేయాలన్నారు. కాయలు నిమ్మకాయ సైజు ఉన్నప్పుడు కవర్లు కట్టడం వలన నాణ్యమైన కాయలు పొందే అవకాశం వుందన్నారు. డీఆర్‌సీ ఏడీఏ విజయశంకర్‌రెడ్డి, డీఆర్‌సీ ఏఓ పద్మజ, ఉద్యానవన అధికారిణి లక్ష్మీప్రసూన, శాంతిపురం ఉద్యానవన శాఖ అధికారిణి వింధ్య, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



పుంగనూరు రూరల్, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులోని మదనపల్లె రోడ్డులో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పుంగనూరు మండలం కమతంపల్లెకు చెందిన శ్రీరాములు కుమారుడు కుమార్(35) పుంగనూరుకు ద్విచక్రవాహనంలో వచ్చి తిరుగు ప్రయాణంలో పెట్రోల్ బంకు వద్ద వెళుతుండగా కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. కుమార్‌కు తలకు బలమైన గాయాలు తగిలినట్లు డాక్టర్లు తెలిపారు.

రోగులకు పండ్ల పంపిణీ

కల్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కల్లూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో శనివారం జూనియర్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జూనియర్ రెడ్‌క్రాస్ విభాగం సమన్వయకర్త వెంకటశిద్దులు, సభ్యులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి



కల్లూరు, అక్టో బరు 26 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం వెంకటదాసరపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యురాలు పద్మావతమ్మ శనివారం మృతిచెందారు. ఈమె 2006లో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలుగా గెలుపొందారు. వెంకటదాసరపల్లి పంచాయతీ కుమ్మరపల్లిలోని ఆమె స్వగ్రామంలో శనివారం జడ్పీటీసీ సభ్యులు మురళీధర్, తెలుగు రైతు ఉపాధ్యక్షులు రామనాథంనాయుడు, టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి తదితరులు పద్మావతమ్మ మృతదేహానికి నివాళి అర్పించారు. మృతురాలి భర్త వెంకటరమణను ఓదార్చారు.

టీడీపీ, వైసీపీ భాయీ..భాయీ !

సదుం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సదుం మండలంలో మద్యం దుకాణాల నిర్వహణలో స్థానిక టీడీపీ, వైసీపీ నాయకులు మిలాఖత్ అయ్యారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో ఆదాయ వనరులపై కూటమి నాయకులతో స్థానిక వైసీపీ నాయకులు 'సర్దుకుపోదాం...రా' అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. ఇందుకు టీడీపీ నాయకులు కూడా సంకోచించడం లేదు. ఇందుకు నిదర్శనంగా సదుంకు మంజూరైన రెండు మద్యం దుకణాలు ఒకటి వైసీపీ, మరొకటి టీడీపీ వారు దక్కించుకోగా ఆ రెండు దుకాణాల్లోనూ వారు భాగస్వాములు అయినట్లు చర్చ జరుగుతోంది.

ములకలపల్లెలో రెవెన్యూ సదస్సు

కుప్పం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం మంకలదొడ్డి పంచాయతీ ముకలపల్లెలో శనివారం తహసీల్దారు చిట్టిబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. రీ సర్వేతోపాటు వివిధ భూ సమస్యలపై ప్రజలనుంచి రెవెన్యూ అధికారులు వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు జేఎంసీ.మురళి, కనకరాజుతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓబులేశ్వరస్వామికి విశేష పూజలు



బైరెడ్డిపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మురారిపల్లెలోవున్న ఓబులేశ్వరస్వామి ఆలయంలో శనివారం విశేషపూజలు నిర్వహించారు. అర్చకులు తిప్పయ్యాచార్యులు స్వామివారికి అభిషేకం చేసి ప్రత్యేకపూజలు జరిపారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆధార్‌లో లోపాలను సరిదిద్దండి

సోమల, అక్టోబరు 26: ప్రభుత్వ బడుల్లో చదివే ప్రతి విద్యార్థి ఆధార్ కార్డులను ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని ఎంఈవో శివరత్న తెలిపారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నారాయణ మాట్లాడుతూ సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు విద్యార్థుల ఆధార్ కార్డులోని లోపాలను గుర్తించి అప్‌లోడ్ చేయాలని సూచించారు. సమావేశంలో హెచ్ఎంలు నిరంజన్‌కుమార్, కుసుమాంబ, యల్లయ్య, హరినాథ్ పాల్గొన్నారు.

అడవి పందుల స్వైరవిహారం



సోమల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సోమల పంచాయతీ మునిరెడ్డిగారిపల్లె సమీపంలోని వరి పొలాల్లో శుక్రవారం రాత్రి అడవి పందులు విచ్చలవిడిగా తిరగాడి పంటలను తొక్కివేసి నష్టపరిచినట్లు బాధిత రైతు కృష్ణారెడ్డి తెలిపారు. అలాగే టమోటా తోటలో తిరగాడి పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు తెలిపారు.

డ్రోన్ కెమెరాతో పారిశుధ్య పనుల పరిశీలన

శాంతిపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం కెనమాకులపల్లె పంచాయతీ పరిధిలోని పలుగ్రామాల్లో శనివారం ఎంపీడీఓ కుమార్ డ్రోన్ ద్వారా పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై గ్రామాల్లో డ్రోన్ ద్వారా పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలిస్తామన్నారు. ఎక్కడైనా అపరిశుభ్రత ఉన్నట్టు తేలితే సత్వరం అక్కడ పారిశుధ్య కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ఎంపీపీ ఉదయ్‌కుమార్, సర్పంచు జయరాం పాల్గొన్నారు.

రాష్ట్ర చదరంగ పోటీలకు శాంతిపురం విద్యార్థి



శాంతిపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఈనెల 28న బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు శాంతిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి కిషన్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నటరాజరెడ్డి తెలిపారు. మండల విద్యాశాఖాధికారులు చంద్రశేఖర్, వెంకటయ్య, ఉపాధ్యాయులు ఎంపికైన కిషన్‌ను అభినందించారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

చౌడేపల్లె, అక్టోబర్26: ఇటీవల కబడ్డీ పోటీలలో జిల్లా జట్టుకు ఎంపికైన అండర్-17 క్రీడాకారులకు శనివారం రూ.15వేలు విలువ చేసే దుస్తులను పారిశ్రామిక వేత్త నవీన్‌కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగరాజరెడ్డి, పీఈటీ రాజేంద్ర, ఉపాధాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కంచర్లను కలిసిన రాష్ట్ర 'పాలా' అధ్యక్షుడు



కుప్పం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ ఆల్ లెక్చరర్స్ అసోసియేషన్ (పాలా) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శరత్ రాఘవేంద్ర, కోశాధికారి ఎం.మహేశ్‌లు శనివారం కుప్పంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను కలిశారు. పాలా ఏర్పాటు, దాని అవశ్యకతను గురించి వారు ఎమ్మెల్సీకి వివరించారు. పాలిటెక్నిక్ కళాశాలల బోధనా సిబ్బంది సమస్యలపై వినతి పత్రం అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ జేమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విభాగాధిపతులు పి.శ్రీనివాసులు, సయ్యద్ హుస్సేన్ మియాన్, అధ్యాపకులు జీఎస్.రమేశ్, విజయకుమార్, కె.నరసింహులు, బి.ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి

పలమనేరు, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి) : బైరెడ్డిపల్లి మండలం తాతిరెడ్డిపల్లిలో దళిత కుటుంబంపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని పలమనేరులోని మానవ హక్కుల సంఘం అవినీతి నిర్మూలన సంస్థ నాయకులు డీవీ మునిరత్నం, శివన్న డిమాండు చేశారు. శనివారం వారు మాట్లాడుతూ తాతిరెడ్డిపల్లికి చెందిన కృష్ణప్ప కుటుంబం తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూమిని అశోక్‌కుమార్ అనే వ్యక్తి రెవెన్యూ అధికారుల ద్వారా గౌరమ్మ అనే మహిళకు పాస్‌బుక్కులు చేసి దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆరోపించారు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తమగోడు వెళ్లగక్కుకొన్నా పట్టించుకోలేదన్నారు. అధికారులు స్పందించి దళిత కుటుంబంపై దాడిచేసిన వారిని అరెస్టుచేసి దళిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండు చేశారు.

విభిన్న ప్రతిభావంతులను ఆదరించాలి

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్ర జ్యోతి): విభిన్న ప్రతిభావంతులను ఆదరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.వి.ఎన్ పద్మజ అన్నారు. శనివారం వేలూరు రోడ్డులోని రాస్ వృద్ధాశ్రమం, విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు, విద్యార్థులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. చీఫ్ లీగల్ న్యాయమూర్తి టి.భానుశేఖర్, నిర్వాహకుడు ముత్యాలు శెట్టి, వైద్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థి వివరాలు తెలుసుకుంటున్న ఎంవీఎన్ పద్మజ

సీసీ రోడ్లలో నాణ్యత ముఖ్యం : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్ర జ్యోతి): ఉపాధి హామీ పథకం కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మంజూరు చేసిన 1,485 అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ముఖ్యమని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులతో అప్రోచ్ రోడ్లు, బీటీ రోడ్లు, ఎంపీ ల్యాడ్స్ నిధులతో మంజూరైన పనుల పురోగతిపై నియోజకవర్గాల వారీగా సమీక్షించారు. 1,485 పనుల్లో 413 గ్రౌండింగ్ కాగా.. 174 వివిధ దశల్లో ఉన్నాయన్నారు. 1,279 పనులకు కాంట్రాక్టర్లను గుర్తించడం జరిగిందని, వాటిని కూడా ప్రారంభించేలా డీఈలు, ఏఈలు శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ శంకర్ నారాయణ, ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డ్వామా పీడీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజానికి కృషి చేద్దాం

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్ర జ్యోతి): అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దామని జిల్లా నెహ్రూ యువ కేంద్రం అధికారి ప్రదీప్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం నెహ్రూ యువ కేంద్రంలో యువతతో విజిలెన్స్ అవేర్నెస్ డే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర స్థాయి అధికారి బాబురెడ్డి, పూతలపట్టు వైస్ ఎంపీపీ మురళీకృష్ణ, నెహ్రూ యువ కేంద్ర సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

నింద్ర, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డ్వామా అడిషినల్ పీడీ ఉమావాణి సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఉపాధి పథకం సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. జరిగిన తప్పిదాలను గుర్తించి రూ.4436 రికవరీ చేసినట్లు ప్రిసైడింగ్ అధికారి ఉమావాణి వెల్లడించారు. విధి నిర్వహణలో సిబ్బంది తప్పిదాలకు రూ.1700 జరిమానా విధించినట్లు చెప్పారు. ఏపీడీ సునీల్‌కుమార్, ఎంపీపీ దీప, ఏవో కృష్ణయ్య, ఎస్‌ఆర్‌పీ బుజ్జి, క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్రీను, ఏపీవో బబిత, ఈసీ శ్రీధర్, సాంకేతిక, క్షేత్ర సహాయకులు, కూలీలు పాల్గొన్నారు.

వితరణలు

బ్యాగులు, నోటు పుస్తకాలు



పాలసముద్రం, అక్టోబరు 26 (ఆంధ్ర జ్యోతి): చలమరాజుఇండ్లు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వనదుర్గాపురానికి చెందిన కె.బాబురాజు తన తండ్రి రామకృష్ణమరాజు జ్ఞాపకార్థం శనివారం నోటు పుస్తకాలు, బ్యాగులు వితరణ చేశారు. హెచ్ఎం కోదండయ్య, టీచర్లు పాల్గొన్నారు.

యూనిఫాం



శ్రీరంగరాజపురం, అక్టోబరు 26 (ఆంధ్ర జ్యోతి): 49.కొత్తపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం స్పందన ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్యామల దేవి ఆధ్వర్యంలో 13 మంది జూనియర్ ఇంటర్ బాలికలకు రెండు జతల దుస్తులు, పెన్నులు, నోటుపుస్తకాలు వితరణ చేశారు. హెచ్ఎం శాంతి, టీచర్లు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి



బంగారుపాళ్యం, అక్టోబరు 26 (ఆంధ్ర జ్యోతి): మంగళపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం అమృత భారతి ఫౌండేషన్ (చిత్తూరు) వ్యవస్థాపకుడు ప్రకాష్ రెడ్డి, శతావధాని ఆముదాల మురళిలు విద్యాసామగ్రి వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాజ్యలక్ష్మి, గణిత అవధాని అరుణ శివప్రసాద్, టీచర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పూతలపట్టు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎర్రచెరువుపల్లెలో రూ.33 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డుతోపాటు పలు అభివృద్ధి పనులు శనివారం నీటి యాజమాన్య సంస్థ పీడీ రవికుమార్ పరిశీలించారు. అలాగే పాటూరు సమీపాన మామిడి తోపులో రింగ్ ట్రెంచ్‌ని తనిఖీ చేశారు. ఉపాధి కూలీలకు రోజువారీ పనులు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఏపీడీ సుబ్రహ్మణ్యం, పంచాయతీరాజ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు పూర్ణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ క్రీడాకారులకు అభినందన



చిత్తూరు సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఫెన్సింగ్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన యాదమరి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అభినందించారు. శనివారం లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్ఎం గిరిజ, పీడీలు రవి, హరికృష్ణ, దాము, టీచర్లు కృష్ణారెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

జాతీయ వాలీబాల్ జట్టుకు రెహమాన్ ఖాన్ ఎంపిక



బంగారుపాళ్యం, అక్టోబరు 26 (ఆంధ్ర జ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 జాతీయ వాలీబాల్ జట్టుకు బంగారుపాళ్యంకు చెందిన దావూద్ ఖాన్ కుమారుడు అబ్దుల్ రెహమాన్ ఖాన్ ఎంపికయ్యాడు. నాలుగు రోజుల క్రితం సత్యసాయి జిల్లా హిందూపురంలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ చూపడంతో జాతీయ జట్టులో చోటు దక్కించుకున్నాడు. రెహమాన్‌ను మాజీ వాలీబాల్ క్రీడాకారులు కుమార్‌రాజా, తులసిరెడ్డి, మురారి, మాజీ డీఎస్డీవో సుదర్శన్ నాయుడు, కృష్ణమూర్తి అభినందించారు.


తెలుగు తమ్ముళ్ల గొడవ

శ్రీరంగరాజపురం, అక్టోబరు 26 (ఆంధ్ర జ్యోతి): తెలుగు తమ్ముళ్ల మధ్య గొడవ జరిగింది. ఎగువకమ్మకండ్రిగకు చెందిన వెంకటేష్ నాయుడు శనివారం ఉదయం సీఎం కండ్రిగకు సీసీరోడ్డు పనులు చేస్తుండగా, అదే గ్రామానికి చెందిన దేవరాజు నాయుడు అడ్డుకున్నారు. 'సీసీ రోడ్డు నువ్వు వేయవద్దు, నేనే వేస్తాను' అని ఇరువురు గొడవపడ్డారు. చొక్కాలు చింపుకుని, పిడిగుద్దులు గుద్దుకున్నారు. అనంతరం ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువతకు ఉపాధి కల్పించడమే సీఎం లక్ష్యం

సీఎంసీ ఆస్పత్రిని సందర్శించిన ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యే జగన్మోహన్

గుడిపాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి కల్పించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. శనివారం సీఎంసీ ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా సీఎం కోరికమేరకు అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ వారు ఆస్పత్రికి రూ.500 కోట్లు ఇచ్చారని తెలిపారు. ఈ ఆస్పత్రిలో అన్నిరకాల వైద్య సేవలతోపాటు స్థానికంగా ఉన్నవారికి ప్రాధాన్యమిచ్చి ఉద్యోగవకాశాలను కల్పించాలన్నారు. డైరెక్టర్ ఉదయ్, పీఆర్వో ప్రిన్స్‌లతో ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభంపై చర్చించారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, నేతలు కోదండయాదవ్, చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

టీడీపీకి కార్యకర్తలే వెన్నెముక / పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభోత్సవంలో నాయకులు




గుడిపాలలో ప్రసంగిస్తున్న జగన్మోహన్ - కార్వేటినగరంలో సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న థామస్ - మురళీమోహన్‌ను సన్మానిస్తున్న నాయకులు

చిత్తూరు సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలే వెన్నెముక అని పలువురు నాయకులు అన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం జిల్లావ్యాప్తంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలుచోట్ల ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. ● చిత్తూరు మురకంబట్టులోని ఎస్‌జీఎం కళ్యాణ మండపంలో జరిగిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జగన్మోహన్ ప్రారంభించారు. అత్యధిక సభ్యత్వాలు చేయించి, రాష్ట్రంలోనే చిత్తూరు నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో నిలపాలని కోరారు. మధ్యాహ్నం చిత్తూరు రూరల్ మండలం బీఎన్ఆర్‌పేటలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, నియోజకవర్గ పరిశీలకుడు సునీల్ కుమార్ చౌదరి, మేయర్ అముద, మాజీ మేయర్ కటారి హేమలత, నేతలు చంద్రప్రకాష్, వసంత్ కుమార్, కాజూరు బాలాజి, త్యాగరాజన్, గాంధీ పాల్గొన్నారు.

గుడిపాల: మండల కేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే జగన్మోహన్, చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్యేలు ఏఎస్ మనోహర్, గాంధీ, నేతలు చంద్రప్రకాష్, కోదండయాదవ్, పీటర్, బాలాజీ నాయుడు, సుమతి, హేమాద్రి నాయుడు, నాగరాజయాదవ్, ఆనంద్ యాదవ్, రవినాయుడు, అనిల్‌కుమార్, ఉదయ, పద్మావతి, సుబ్రహ్మణ్యం నాయుడు, చెన్నకేశవులు నాయుడు తదితరులు పాల్గొన్నారు. కాగా, అధిక సంఖ్యలో కార్యకర్తలు ఉంటే గుడిపాలలో తనకు మెజారిటీ తగ్గడం ఆవేదన కల్గించిందని ఈ సందర్భంగా జగన్మోహన్ అన్నారు.

గంగాధరనెల్లూరు: మిట్టకొత్తూరులోని కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే థామస్, టీడీపీ నాయకులు ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, భీమనేని చిట్టిబాబునాయుడు, బాబునాయుడు, రాంబాబురెడ్డి, దేవసుందరం, స్వామిదాస్, ఇందిరమ్మ, అశోక్‌నాయుడు, వెంకటేష్‌నాయుడు, నరసింహులునాయుడు, లోకనాథం, నియాజ్‌అలీ, సుధాకర్‌నాయుడు, నీరజాక్షులురెడ్డి పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే థామస్, నాయకులు చెంగల్రాయయాదవ్, రాజేంద్రరెడ్డి, చెంగల్రాయులు, గురుసాల కిషన్‌చంద్, బట్టే చాణిక్యప్రతాప్, మురళీమోహన్, బీగాల రమేష్, దాము పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే థామస్, నాయకులు గంధమనేని జయశంకర్ నాయుడు, నిరంజన్‌రెడ్డి, గుండయ్య, హేమాద్రి యాదవ్, జయరామనాయుడు, బల్ల వెంకటేష్, ఎస్.కుమార్, వెంకటేష్‌రెడ్డి, నాగారాజు, చందు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సమక్షంలో చిలామాకులపల్లెకు చెందిన వైసీపీ యువ నాయకుడు జె.లోకేష్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

పూతలపట్టు: వావిల్‌తోట పంచాయతీ వెంకటాపురం దళితవాడలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీమోహన్, నాయకులు యువరాజు నాయుడు, దొరబాబు చౌదరి, గంగారపు గోపి, చంద్రబాబు, బాబురావు, ప్రతాపనేని చంద్రమౌళి, మధు, భార్గవ్, కృష్ణమూర్తి, రెడ్డెప్ప రెడ్డి, రామ్మూర్తి నాయుడు, నిరంజన్ పాల్గొన్నారు.

నగరి: ఒకటో వార్డులోని ప్రతి ఒక్కరికీ టీడీపీ సభ్యత్వం ఉచితంగా ఇవ్వనున్నట్లు ఆ పార్టీ నేత రామానుజం చలపతి తెలిపారు. సామాలమ్మ గుడి వద్ద జరిగిన కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్ లత, అలిమేలు, రాధ, ఆదెమ్మ తదితరులు పాల్గొన్నారు. ● నగరి మున్సిపాలిటీ, మండల పరిధిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి బాలాజి, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి మీరా, నాయకులు శివకుమార్‌రెడ్డి, రమేష్‌బాబు, సురేష్ నాయుడు, కృష్ణారెడ్డి గుణశేఖర్, ఉమాపతిరాజు, నారాయణస్వామినాయుడు, గోపాల్‌శెట్టి, సలీమ్, శ్రీధర్, బాబురెడ్డి, మణి, వరదరాజులు, ఆనంద్, అలెక్స్ పాల్గొన్నారు.



నింద్ర: కావనూరులో జరిగిన కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ వాసు, నాయకులు రవినాయుడు, విజయ్‌కుమార్, రమేష్, ప్రకాష్, వెంకటేశులు రెడ్డి, మహేష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.





విజయపురం: కోసలనగరంలో జరిగిన కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక టీడీపీ కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, నాయకులు బాబుయాదవ్, సుధాకర్‌రాజు, కొండూరు ధామోదర్‌రాజు, బాష, హరికృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

లైఫ్‌టైమ్ సభ్యత్వం తీసుకున్న జయప్రకాష్

బంగారుపాళ్యం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండల అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్.. రూ.లక్ష చెల్లించి లైఫ్‌టైమ్ సభ్యత్వం తీసుకున్నారు. మండల టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు జనార్దన్ గౌడ్, ఎన్‌పీ ధరణీ ప్రసాద్ నాయుడు, కమల్‌నాథ రెడ్డి, శ్రీనివాసులు, చంద్రయ్య నాయుడు, హేమచంద్ర నాయుడు, హరిప్రసాద్, కొండేటి శివ పాల్గొన్నారు.



సంక్షిప్తంగా..

పారిశుధ్యం లోపిస్తే చర్యలు

వెదురుకుప్పం, అక్టోబరు 26 (ఆంధజ్యోతి): పారిశుధ్యం లోపిస్తే చర్యలు తప్పవని ఈవోపీఆర్డీ పురుషోత్తం హెచ్చరించారు. శనివారం ఇనాంకొత్తూరు పంచాయతీలో జరుగుతున్న పారిశుధ్య, మట్టి పనులను పరిశీలించారు. టీడీపీ నేత కఠారి మోహన్‌రెడ్డి, డీడీవో ఇందు తదితరులు పాల్గొన్నారు.

కేవీపురంలో గ్రామసభ

విజయపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కేవీపురంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. డీటీ అశోక్, మండల సర్వేయర్ శేఖర్, వీఆర్వో రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 26 (ఆంధ్ర జ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి శనివారం తవణంపల్లె మండలం మైనగుండ్లపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యంరెడ్డి రూ.1,01,116 విరాళంగా అందించారు. విరాళదాతను సూపరింటెండెంట్ కోదండపాణి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు నవ్యశ్రీ ఎంపిక

నగరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ముడిపల్లె జడ్పీ ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థిని నవ్యశ్రీరాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైందని హెచ్ఎం మురళీకృష్ణ తెలిపారు. విద్యార్థినితోపాటు కోచ్ ఆనందమోహన్‌ను టీచర్లతో కలిసి అభినందించారు.



క్రైం కార్నర్

13మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్ర జ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 13 మందికి జడ్జి జరిమానా విధించారు. శుక్రవారం ట్రాఫిక్ సీఐ నిత్యబాబు ఆధ్వర్యంలో పోలీసులు పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేశారు. 13 మంది మద్యం తాగి వాహనాలు నడిపినట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. వీరిని శనివారం జడ్జి ఉమాదేవి ముందు హాజరు పరచగా, ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. బంగారుపాళ్యంలోనూ మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి చెరో రూ.10వేల చొప్పున జడ్జి జరిమానా విధించినట్లు బంగారుపాళ్యం సీఐ శ్రీనివాసులు తెలిపారు.

బంగారు గొలుసు చోరీ

పూతలపట్టు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో బంగారు గొలుసును చోరీ చేశారు. పాలకూరు పంచాయతీ కుప్పన్నగారిపల్లెకు చెందిన మల్లి అనే మహిళ శనివారం సాయంత్రం వ్యవసాయ బావి వద్ద ఉన్న పశువులను ఇంటికి తోలుకుని వచ్చేందుకు రోడ్డు పక్కన నడిచివెళుతున్నారు. ఆ సమయంలో ద్విచక్రవాహనంలో వచ్చిన ఇద్దరు యువకులు ఆమె వద్ద ఆగి.. గ్రామంపేరు ఏమిటని అడిగారు. ఆమె జవాబు చెప్పేలోపు మెడలోని సుమారు రూ.6.5 లక్షల విలువైన ఎనిమిది సవర్ల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనపై పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

పూతలపట్టు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన వడివేలు పనినిమిత్తం తిరుపతికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి తిరుపతి - కాట్పాడు రైలులో బయల్దేరాడు. మార్గమధ్యంలో పూతలపట్టు మండలంలోని హసన్‌పురం సమీపాన రైలు నుంచి కిందపడి మృతిచెందాడు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాయితీ పరికరాలు సద్వినియోగం చేసుకోండి: థామస్

వెదురుకుప్పం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ నీటిసాగు పథకంలో ప్రభుత్వం ఇస్తున్న రాయితీ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్ అన్నారు. శనివారం కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయం వద్ద అర్హులైన రైతులకు బిందు సేద్య పరికరాలను 90 శాతం సబ్సిడీతో మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జీడీనెల్లూరు జనసేన ఇన్‌చార్జి యుగంధర్‌పొన్న, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గురుసాల కిషన్‌చంద్, ఉపాధ్యక్షుడు బోడిరెడ్డి సుధాకర్, వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బట్టే చాణిక్యప్రతాప్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు గుండయ్య, మండల ప్రధానకార్యదర్శి రాజేంద్రరెడ్డి, టీడీపీ నాయకులు బీగాల రమేష్, చెంగల్రాయులు, ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రహ్మణ్యం, ఏఈవో హేమాద్రి, ఎంఐఏవో జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పశుగణన పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

నామినేటెడ్ పదవి ఇవ్వండి

సీఎంకు రిటైర్డ్ ఎస్పీ చిన్నస్వామి వినతి



గంగాధరనెల్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవి తనకు ఇవ్వాలని సీఎం చంద్రబాబుకు రిటైర్డ్ ఎస్పీ, టీడీపీనేత పి.చిన్నస్వామి విజ్ఞప్తి చేశారు. వేపంజేరి పంచాయతీ గోవిందరెడ్డిపల్లె ఆదిఆంధ్రవాడకు చెందిన చిన్నస్వామి శనివారం అమరావతిలోని సచివాలయంలో సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి, తన బయోడేటాను అందజేశారు.

విద్యార్థులందరికీ అపార్ ఐడీలు

తవణంపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులందరికీ అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీలను త్వరగా ఓపెన్ చేయాలని ఎంపీడీవో రెడ్డిబాబు, ఎంఈవో త్యాగరాజులురెడ్డి సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు తదితర రాయితీలను ఈ ఐడీ ద్వారా అందించడం జరుగుతుందన్నారు.

నేడు వాకర్ల సమావేశం

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్ర జ్యోతి): గిరింపేట పీవీకేఎన్ వాకర్స్ అసోసియేషన్ సమావేశం ఆదివారం ఉదయం జరగనుంది. ఈ మేరకు సంఘం కార్యదర్శి వీకే విశ్వనాథ్ తెలిపారు. ఎమ్మెల్యే జగన్మోహన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

